భయపెడుతున్న ద్రవ్యోల్బణం

గత నాలుగేళ్లలో ఎన్నడూ లేనంతంగా ఈ మధ్య ధరలు ఆకాశాన్నంటంతో ద్రవోల్బణం చర్చలోకి వచ్చింది. చలామణిలో ఉన్న అధిక ద్రవ్యం అందుబాటులో ఉన్న కొద్ది వస్తువులను కొనడానికి చేసే ప్రయత్నంలో ఆర్థిక వ్యవస్థలో అకస్మాతుగా ధరలు పెరిగే పరిస్థితిని ద్రవ్యోల్బణం అంటారు.

ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల్లో ఉత్పత్తిచేసే, ఉపయోగించే కొన్ని ముఖ్య వస్తువులను ఎంపిక చేసి.. ప్రతి దాన్ని ప్రాధాన్యత క్రమంలో పాయింట్ల కేటాయించి.. వాటిధరల్లో ఏర్పడే మార్పుల కనుగుణంగా

ఆధారంగా తయారు చేసేది వినియోగదారుల ధరల సూచీ(consumer price index) అనేక దేశాలలో వినియోగదారులకు లభించే ధర ఆధారంగా ద్రవ్యోల్బణం నిర్ధారిస్తారు. భారతదేశంలో ఎంపిక చేసిన వస్తువుల హోల్‌సేల్‌ధరల సూచీ (wholesale price index) ఆధారంగా ద్రవ్యోల్బణం నిర్ధారిస్తారు. హోల్‌సేల్ ధరల సూచీలో మొత్తం 435 వస్తువులు ఉన్నాయి. వీటిని ప్రాథమిక వస్తువులు (కూరగాయలు, ఆహరధాన్యాలు,పండ్లు వంటివి–22శాతం ప్రాధాన్యత) ఇంధనం, విద్యుచ్ఛక్తి తదితర వస్తువులు (14.2శాతం ప్రాధాన్యత), ఉత్పత్తి చేసిన వస్తువులు (manufactured goods 63.8 శాతం ప్రాధాన్యత)గా విభజించారు. హోల్‌సెల్ ధరల సూచికి 1993–94ను మూల ఏడాదిగా (Base Year).. ఏ ఏడాది ధరల్లో మార్పు అతి తక్కువగా ఉంటుందో దాన్ని మూల ఏడాదిగా ఎంచుకున్నారు. ద్రవ్యోల్బ ణాన్ని హోల్‌సెల్ ధరల సూచి ఆధారంగా ప్రతి వారాంతంలో ప్రకటిస్తారు. ఒక వారంలో ద్రవ్యోల్బణం ఏడు శాతం ఉంటే దాని అర్థం ఎంపిక చేసిన వస్తువుల హోల్‌సేల్ ధరల సూచి, గత ఏడాది అదే వారంలో ఇదే వస్తువుల హోల్‌సేల్ ధరల సూచి కంటే ఏడు శాతం తక్కువగా ఉందన్నమాట.

ద్రవ్యోల్బణం అనేక రకాలుగా ఉంటుంది. వస్తువుల డిమాండ్ పెరగడం వల్ల ధరలు పెరిగి ఏర్పడే ద్రవ్యోల్బణం. ఉదాహరణకు గృహాలు కొనుక్కునే వారు పెరగడంతో స్టీలు, సిమెంట్ ధరలు పెరిగి ధరలు పెరగడం. ఇది డిమాండ్ పుష్ ఇన్‌ప్లేషన్. మరోరకంగా వస్తువుల ఉత్పత్తి తగ్గి, సప్లై తగ్గడం వల్ల ధరలు పెరుగుతాయి. దీన్ని కాస్ట్ పుష్ ఇన్‌ప్లేషన్ అంటారు. ఉదాహరణకు పెట్రోలియం ఎగుమతి చేసే దేశాలు అకస్మాత్తుగా ఉత్పత్తి తగ్గిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతాయి. ఈ రెండు విధాలుగానే కాక ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగుల, శ్రామికుల జీతాలు పెంచినప్పుడు మార్కెట్‌లో చలా మణిలో ఉన్న ద్రవ్యం అకాస్మాత్తుగా పెరుగుతుంది. కంపెనీలు కూడా పెంచిన భారాన్ని వినియోగ దారులపై మోపు తాయి. దీనితో వస్తువుల ధరలు పెరగడమే కాకుండా మార్కెట్‌లో చలామణిలోకి వచ్చిన అధిక ద్రవ్యం అందుబాటులో ఉన్న కొద్ది వస్తువులను కొనడానికి చేసే ప్రయత్నంలో ధరలు మరింత పెరిగి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. గతంలో మన దేశంలో ద్రవ్యోల్బణం జాతీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ప్రభావితం అవుతుండేది. కానీ 1991 నుంచి సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మమేకం కావటంతో ఎగుమతులు,

దిగుమతుల పై ఉన్న ఆంక్షలు పోయాయి. ఫ్రీ ట్రేడ్ వ్యవస్థలో వస్తువుల నాణ్యత, గిరాకీల ఆధారంగా ధర నిర్ణయం జరగడంతో దేశం వెలుపల నెలకొన్న ఉత్పత్తి, డిమాండ్‌ల స్థితి ఆధారంగా జాతీయస్థాయిలో ధరలుపెరిగి ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఉదాహరణకు బియ్యం, గోధుమల వంటి ఆహార ధాన్యాల ధరలు పెరుగుదల వెనుక జాతీయస్థాయిలో వీటి ఉత్పత్తి పెరగకపోవడమే. ప్రపంచ దేశాలకు ఆస్ట్రేలియా, బ్రెజిల్ వంటి దేశాల్లో గోధుమ పంట దెబ్బతినటం కూడా ఒక ప్రధాన కారణం. ప్రపంచ దేశాల్లో ఈ ఆహార ధాన్యాల నిలువలు గణనీయంగా పడిపోవడంతో డిమాండ్ మరింత పెరిగి ధరలు పెరుగుతూ వచ్చాయి. భారత ప్రభుత్వం గోధుమలపై దిగుమతి సుంకాన్ని ఎత్తివేసినా ధరలు తగ్గకపోవడానికి కారణం ప్రపంచ మార్కెట్‌లో గోధుమ ధర భారతదేశంలో గోధుమ ధరకు రెట్టింపు ఉండటం.

ద్రవ్యోల్బణానికి మరొక కారణం భారత, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో (250 కోట్ల జనాభా) వేగంగా పెరుగుతున్న ఆర్థిక అభివృద్ధి రేటు. ఉదాహరణకు ఈ దేశాలలో జనాభా తలసరి ఆదాయం వంద డాలర్లు పెరిగినా వస్తు సేవలకు 250 బిలియన్ డాలర్ల అదనపు డిమాండ్ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడుతుంది. ఈ పెరిగిన డిమాండ్ వల్ల కూడా ధరలు పెరుగుతాయి. అంతేకాక స్థూల జాతీయోత్పత్తి (Gross Domestic Product- GDP) పెంచడానికి బ్యాంకులు ఇచ్చే ఉదారరుణాలు, పెరిగే జీతభత్యాలు మార్కెట్‌లో ద్రవ్యచలామణిని పెంచి ద్రవ్యోల్బణానికి కారణం అవుతాయి. సగటు మానవ జీవితంపై ద్రవ్యోల్బణం ప్రభావం అర్థం చేసుకోవడానికి ఈ చిన్న ఉదాహరణను పరిశీలిద్దాం. మన బాల్యంలో నాన్న సినిమా చూడటానికి 50 పైసలు ఇచ్చారనుకుందాం. ఆ 50 పైసలు అలాగే దాచుకొని ఈ రోజు సినిమా హాలుకు వెళ్లి టికెట్ అడిగితే 'సారీ సర్.. 50 పైసలకు చాక్లెట్ కూడా రాదు.. సినిమా టికెట్ ఎలా వస్తుంది' అంటాడు. మరి 15 సంవత్సరాల క్రితం 50 పైసలకే లభించిన టికెట్ ఈ నాడు ఆ ధరకు ఎందుకు లభించడం లేదు? దీనికి కారణం మన దగ్గర ఉన్న ద్రవ్యానికి (50 పైసలకు) విలువ (కొనుగోలు శక్తి) తగ్గిపోవడం. దీనికి కారణం ద్రవ్యోల్బణం. ద్రవ్యానికి తగ్గిన కొనుగోలు శక్తికి పరిహారంగా వడ్డీ రేటు అమలులోకి వచ్చింది. మన ధనాన్ని ఇనుపపెట్టెలో భద్రం చేసి 15 ఏళ్ల తర్వాత తీస్తే అదే మొత్తం ఉంటుంది. మరి బ్యాంకులో దాచుకొని 15 ఏళ్ల తర్వాత తీస్తే అసలు, వడ్డీ కలిసి దాచుకున్న అసలు మొత్తానికి కొన్ని రెట్ల ధనం లభిస్తుంది. అంటే ద్రవ్యోల్బణం వల్ల మన డబ్బుకు జరిగిన నష్టాన్ని బ్యాంకులిచ్చే వడ్డీ రేటు అడ్డుకుంటోందన్నమాట. అందుకే ద్రవ్యోల్బణం పెరిగితే వడ్డీ రేట్లు పెరగడం, ద్రవ్యోల్బణం తగ్గితే వడ్డీ రేట్లు తగ్గడం మనం చూస్తాం. ద్రవ్యోల్బణానికి, వడ్డీరేట్లకు మధ్య ఉన్న ఈ అవినాభావసంబంధం వల్ల మన ధనాన్ని ఎక్కడైనా పెట్టుబడి పెట్టేటప్పుడు, ఆ పెట్టుబడిపై మనకొచ్చే ప్రతిఫలం శాతం కనీసం ఆ సమయంలోని ద్రవ్యోల్బణం ఎంత శాతం ఉందో అంతైనా ఉండాలి. పరిమిత స్థాయిలో ద్రవ్యోల్బణం కూడా ఆర్థిక అభివృద్ధికి అవసరమే. ఎందుకంటే ద్రవ్యోల్బణం వల్ల భవిష్యత్తులో ధరలు పెరుగుతాయన్న ఆశతో వినియోగదారులు, వ్యాపారస్తులు

వస్తువులను అవసరానికి మించి కొంటారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో నిత్యం లావాదేవీలు జరిగి ఆర్థికాభివృద్ధికి దారితీస్తుంది. ఆర్థిక శాస్త్రవేత్తల అంచనా ప్రకారం మూడు శాతం వరకు ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థకు ఆరోగ్యకరమే. ద్రవ్యోల్బణం ఈ లక్ష్మణరేఖను దాటితే ఫలితాలు ఎలా ఉంటాయో మనం చూస్తూనే ఉన్నాం. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు వస్తువుల ఉత్పత్తి పెంచడం, తద్వారా ధరలను నియంత్రించడం, వస్తువుల కృత్రిమ కొరత ఏర్పడకుండా చూడటం, ప్రజా పంపిణీ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్ది సామాన్య మానవుడికి నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చూడటం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆహార విలువలనను సమృద్ధిగా ఉంచుకోవడం, ఆర్థిక వ్యవస్థలో చలామణిలో ఉన్న అధిక ద్రవ్యాన్ని (బ్యాంకుల్లో ద్రవ్య నిలువల రేటును పెంచడం ద్వారా) రిజర్వ్ బ్యాంకు ద్రవ్య పరపతి విధానం ద్వారా వెనక్కు తీసుకోవడం లాంటి చర్యలు సకాలంలో తీసుకోవడం అవసరం.